

# ఢిల్లీ ఛలో

రచన : "కృష్ణారావు"



సౌందర్య సౌరభాలను వెదజల్లుతూ, గోదావరి ఇసుకతిన్నెలకు రంగుల నద్దుతూ, కిలకిలా నవ్వుతూ ప్రారంభమైంది సంధ్య. భావప్రవాహంలో మునిగితేలే యోగికి, పిలిస్తే పలకరించే, నదిలో నీరు గలగలమంటే దాచలేని నిశ్శబ్దత, గాలివినరితే వినబడే ప్రశాంతతలు అవరించినా తెలియలేదు పాపం!! అంతలో ఓ గాలికెరటంలేచి, ఇసుకధూళిరేగి కంట్లోపడేసరికి, ఊహాలోకంనుంచి తేరుకుని ఈ లోకంలో పడ్డాడు యోగి. శ్మశానంలో నక్క అరుపు స్పష్టంగా వినిపించేసరికి భయం వేసిందతనికి. చుట్టూచూసి 'అరె నాకుతెలియకుండా, లేతవెన్నెల ఎప్పుడు ఎట్లా వచ్చింది చెప్మా అనుకుని లేచాడు యోగి.

యోగి అనగానే, మూరెడు మీసం, బారెడు గడ్డం, మెళ్ళో రుద్రాక్షలు, దండ కమండలాలు నఖశిఖపర్యంతం కాషాయవస్త్రాలూ ఉంటాయని, వాడొక సన్యాసి అని అనుకునేరు కొంపదీసి. చిన్నప్పుడు వాళ్లమ్మ నాన్నా గజంపొడుగున పేరుపెట్టి చివర మాత్రం 'యోగి' అని తగిలించేరు. వాడు కాస్తా పెరిగి పెద్దయి కాలేజీచదువుకు మొదలుపెట్టి, సంపాదనలో పడేనాటికి, అంతపొడుగు నామధేయం కరిగి కరిగి ఇంత్తై మరింతకంటే ఇంతవలేక 'యోగి'తో ఆగిపోయింది.

వెన్నెలరోజులు వచ్చేసరికి, కరెంటుకూడా దండుగని కామోసు వీధిదీపాలుకూడా ఆరిపోయాయి. తీవ్రాలోచనలతో అన్యమనస్కుడైన యోగి ఇంటిముందాగి ఒక్కసారికలియజూచాడు. 'అరె, నా లాడ్జి ఆ చివరుంటే, ఇటెలా వచ్చానా' అని ముక్కుమీద వేలేసుకుని, పరధ్యానానికి నవ్వుకుంటూ ఇంకా నయం అనుకుని వెనుకకు మళ్ళాడు.

తన అద్దెగది కనుపించి కనుపించడంతోటే తాళం బయటకుతీశాడు యోగి, మళ్ళా క్రితం సంఘటన జ్ఞాపకంవచ్చింది. అసలీ లాడ్జి తనదా అనే అనుమానం రావడంతో మరొక్కమారు పరిశీలనగా చూచి, మరేం అనుమానం లేదనుకుని, తాళంతీసి తలుపు త్రోశాడు. ఆశ్చర్యం తలుపురాదేం ? ఇదేమిటి చెప్మా అనుకున్నాడు యోగి. తను లేని సమయంలో ఇంట్లో ఎవరోదూరి, లోగడియపెట్టి గది సర్దుతున్నారా అనే అనుమానం తగలగానే, భయంతో గుండె గబగబా కొట్టుకుంది. తలుపుతట్టితే? 'అమ్మో' అనలేవాళ్లు దొంగలు కదా. వాళ్ళచేతిలో కూస్తో కాస్తో ఏదైనా ఘన పదార్థంవుంటే దానితో నీ తలకాస్తా రెండు చెక్కలైతే మీ వాళ్లకు నువ్వొకైక పుత్రుడివి కావడం, నెలతిరిగేనరికి రెండు పచ్చకాగితాలు రంగున పేలగొట్టి పుచ్చుకునే నీ హెూదా, నువ్వు పోస్టాఫీసులో దాచిన డబ్బూ వృధాయైపోవూ? పిరికిమంత్రం నూరిపోయబడడంతో జంకిపోయి ఏమిచేయడానికీ పాల్పోక నిలువబడిపోయాడు. 'ఒరే యోగీ, మరి అల్లప్పుడు నేను డిటెక్టివ్ నవతాననీ, ఆ పనిలో నే నెంతగానో రాణిస్తాననీ, డంభాలు కొట్టి, నిముష నిముషానికీ నీ ముఖవర్చస్సూ ఒడ్డూ పొడుగులూ చూచుకుని మురిసిపోయే వాడివికదా. ఆ ధైర్యం కాస్తా ఇంతేనుట్రా' అని అతని మనసు రెండు చీవాట్లుపెట్టేసరికి ధైర్యంతెచ్చుకున్నాడు. తలుపుకొట్టితే ప్రమాదము, కొట్టకపోతే లోపల ఏదో గలాటా, అది కాకుండా తన కాకలౌకటి వేస్తోందికదామధ్య. చుట్టుతిరిగి పెరటిగోడ నెమ్మదిగాదాటి అడుగులో అడుగేసుకుంటూ భయంగా ముందుకు నడిచాడు. వరెండాలో స్విచ్ ఆన్‌చేసేసరికి గదిలో దీపం వెలిగింది, నెమ్మదిగా తొంగి చూచి గదిలో ఎవరూ లేరని నిర్ధారణచేసుకుని లోనికి వెళ్ళాడు. ఆశ్చర్యం !! ఎవరూ లేరే!! పోని లోగడియపడిందా అనుకుంటే అదీ సరిగానే యుందే? ఐతే తలుపెందుకు రాదు. ఈ గమ్మత్తులోని కీలకం ఎంతసేపటికి తెలియక తికమకపడ్డాడు యోగి. పోని బయటతలుపు మరొక్కసారి పరిశీలిద్దామని తిరిగివచ్చి, నిశితంగా పరీక్షించాడు తలుపును. మీది గొళ్లెం పెట్టబడియుంది. ఇందాక గాలి పీల్చుకుపోయే సందర్భంలో తనే గొళ్ళెం తగిలించాడు.

'ఔరా ఏమిమతి' అని నిట్టూరుస్తూ కూర్చున్నాడు యోగి గదిలో కుర్చీలో. యోగీ క్షణం క్రితం త్రోవ మరచి ఆ చివరకు వెళ్లిపోయా ఇప్పుడు నీ చేత్తో నీవే గొళ్ళెంపెట్టేసి, ఊరంతా గాభరాగా తిరిగావూ, నీకుమతి పోయిందా ఏం? నువ్వు చదుకునేటప్పుడు, నిన్న మొన్నటిదాకా నువ్వెంతో తెలివైన ఘటానివని, మాంచి చురుకైన వాడవని అందరూ నిన్ను పొగిడేవారే? ఆతెలివి, చురుకుదనం ఏగంగలో కలసి పోయాయిరా? ఏమిరా ఇట్లా రోజురోజూ దిగజారి పోతున్నావు ?" అని తన అంతరాత్మ హెచ్చరిస్తోంది.

నిజానికి ఏమిటో ఈమధ్య పరధ్యానం, వెర్రిగా చూడడం, చేస్తూచేస్తూన్న పనిని మధ్యలో ఆపి, ఆలోచించుకుంటూ గంటల తరబడి విగ్రహంలా ఉండిపోవడం.... ఇత్యాది అవలక్షణాలు జోరుగా కనుపిస్తున్నాయ్ అతనిలో. సడెన్‌గా ఆటాక్ అయిన ఈ రోగం ఏ రకానికి చెందినదా అని మధ్య మధ్య అనుకునే వాడుయోగి. తిన్నతిండి వంట బట్టకపోవడం, ఒక చోట స్థిరంగా కాలునిలుప బుద్ధి కాకపోవడం....ఏమిరా అని బెంగపట్టుకుంది యోగికి. ఆబెంగతో నిద్ర పట్టకపోవడం కూడా కద్దు. అందుకే, ఆఫీసు పనుల్లో పొరపాట్లువస్తే పరువుదక్కదని మూణ్ణెల్లు సెలవు గ్రాంటు చేయించుకుని ఇంట్లో కూర్చున్నాడు.

భోజనం చేయాలని లేకపోయినా, చేతిని హింసించడం ఇష్టంలేక కొంచెం కక్కుర్తి పడిలేచాడుయోగి. తెల్లవారిన తర్వాత, తన మనశ్శారీరక అవలక్షణాలను గురించి డాక్టరుతో కన్సలు చేస్తేనేగాని లాభంలేదనుకున్నాడు.

మనసు టేబిల్‌ఫాన్‌లా తిరుగుతున్నా, చలీవేడీ కలసిన మార్చి నెలాంతపు గాలులు గోదావరి నీటి కెరటాలపై తేలితేలి మెల్లగా కిటికీవెల్వెట్ తొలగించుకుని హాయిగా ప్రవేశిస్తూంటే మత్తుగా నిద్రముంచుకొస్తోంది. "గుడ్‌పడుకోరా అబ్బాయ్" అనుకున్నాడు యోగి.

"అబ్బాయి గోరూ పొద్దంతా నిద్దరోతారా ఏటి?" పాచిమనిషి కేకేస్తే గుభీమనిలేచి చూచేసరికి తొమ్మిది ఎ. ఎమ్." బాగుందిరా యోగి నీ పద్ధతి. ఇంత బద్ధకమైతే ఎట్లారా అనుకుంటూలేచి, అరగంటలో వీధినపడ్డాడు.

హాస్పిటల్ అట్టే రద్దీగాలేదు. డాక్టర్‌కూడా కుఱ్ఱాడే అవడంవలన ఉషారుగా కనుపించాడు యోగికి. ఐనా అతడు డాక్టర్ గనుక, తన లాటి రోగులకు రంగునీళ్ళుపోయడానికి బోర్డు తగిలించుకున్నాడు కనుక ఓ నమస్కారం పారేశాడు.

'ఏమిటి సంగతి బ్రదర్' అని ప్రశ్నించగనే, ఈమధ్య తనలో కనిపిస్తున్న వికారాలను, వాటి గుణగణాలను ఆమూలాగ్రం వర్ణించి 'ఇప్పుడుచెప్పు' అన్నట్లు ఊరుకున్నాడు యోగి.

నఖశిఖపర్యంతం, ఎగ్జామిన్‌చేసి, దీర్ఘంగా ఆలోచిసూ ఉండిపోయాడు డాక్టర్.

'వాట్ డాక్టర్' గాభరాగా అడిగాడు యోగి.

'నాకేం జబ్బు కనిపించటంలేదే'

'రక్షించావ్ ఫో' అని అనుకుని, ఒళ్లంతా స్వయంగా చూచుకుని పిడుగులాంటి నీ శరీరానికి రోగమేమిటి' ధీమాపడ్డాడు యోగి.

ఒక మూలనుండి అనుమానం ఇంకా పీకుతూంటే 'లేదు డాక్టర్....ఏదో జరిగివుండాలి. అది మీరేదో కాస్త గట్టిగా....' నసుగుతూ పది రూపాయలకాగితం టేబిల్‌మీదపెట్టాడుయోగి.

రెండు వ్రేళ్లసందునా దూర్చి తమాషాగా మడిచి ఆ కాగితాన్ని జేబులో పెట్టున్న డాక్టర్ దేనినిగురించో ఆలోచిస్తున్నాడు 'పది రూపాయలకు తిలోదకాలు పదిలానా? అని బాధపడసాగాడు యోగి. ఉండుండి బేషుగ్గా చిన్న నవ్వు నవ్వాడు డాక్టర్. అదిచూచి 'ఆఁ ఫర్వాలేదు వీడికేదో ఐడియా తట్టకపోతే అట్లా నవ్వడని ధైర్యపడి ఆశగా చూచాడు.

'మనకి వివాహము' సైకాలజిస్టులా పోజు పెట్టి అడిగాడు డాక్టర్.

వీడు 'మన' అని బహువచనం బుద్ధిజ్ఞానం లేకుండా ఉపయోగించినందుకు తంవామా అన్నంత కోపం, వీడుకూడా తన లాగే బ్రహ్మచారేనా అన్న అనుమానం ఒక్కసారే జంటగా బయలుదేరడంతో 'పోనిస్తూ' అని నిలవ్రదొక్కుకున్నాడు.


'నో నో నో డాక్టర్ అదొహటి కూడానా?' జాలీగా కుర్చీకి చేరబడి నవ్వేడు యోగి.

'రైటో!! అగీ సంగతి, ఇంకా నేను ప్రిస్క్రైబ్ చేయాలాయేం' హుషారుగా నవ్వాడు డాక్టర్.

'మరందుకేగా మీ దగ్గరకొచ్చింది'

'వినుమరి చెప్పతున్నా .... నీ ఈ జబ్బు కుదరాలంటే నీ కొక డాక్టర్ కమ్‌సర్స్‌కావాలి' ఫేన్ గిరా గిరా తిరిగినట్లు నవ్వుతున్నాడు వ్యంగ్యంగా.

'అదుగో ఆ శ్రమ నాకెందుకు ? మరేం అనుకోకుండా మీరే ఆ డాక్టర్ అవకూడదూ? ఫీజులకు జంకకండి' అమాయకంగా అడిగాడు యోగి.



'నేనా?....నన్నా....చంపావ్‌పో' గబగబా, జోరుజోరుగా ఆ చివర్నుంచి ఈ చివరకు ఊగుతూ నవ్వుతున్నాడు డాక్టర్.

ఆ నవ్వుచూచి ఇదేమిటి వీడికి అకస్మాత్తుగా పిచ్చెత్తిందేమిటా అని నిర్ఘాంతపోయాడు. కొంచెంసెపటికే డాక్టర్ యధాప్రకారంగా తయారయేసరికి, లేదులేదు వీడేదో జోక్‌కొట్టాడనిన్నీ, మంచి క్లూలో ఇరికించాడనిన్నీ ఆదేమిటా అని ఇదయాడు యోగి.

'అదికాదయ్యా పెళ్లి ....' సీరియస్‌గానే మాట్లాడుతున్నాడు డాక్టర్.

'పెళ్లి....' ముఖం చిట్లించాడు యోగి ఆరకపు లావాదేవీలకు తను పక్కా వ్యతిరేకిని గదా, వీడి దుంపదెగా ఇట్లా అంటాడేమిటా అని ఛర్రునలేచి, మళ్ళా బాగోదని తగ్గిపోయాడు.

'చూడు భాయ్ ...సాధ్యమైనంత త్వరలో లక్షణంగా....'

'ఆఁ నామాట విను లేకపోతే ప్రమాదం' ఫుల్‌స్టాఫ్‌లా ముఖంపెట్టాడు డాక్టర్.

ఇదెక్కడి గడ్డుసమస్య అనుకుంటూ డిస్పెన్సరీనుండి బయటపడ్డాడు యోగి. తన లక్షణాలు, వికారవుపనులు, డాక్టర్ చెప్పిన లక్షణాలకు చాలా చుట్టరికం, ఏవో పోలికలు ఉన్నట్లుతోచింది. ఇంతకీ రోగం ఆ కేటగిరీలో వస్తుందా రాదా అని కొంచెంకూడా ఆలోచించకుండా, గభీమని కన్ఫర్మ్‌చేశాడు కదా ఈ డాక్టరొకడు. కన్ఫర్మేషన్‌లోకూడా నిజం కొంతవరకూ ఉన్నట్లుతోచి, 'హరిపిడుగా' అని డాక్టర్ భుజంతట్టాడు మనసులోనే. 'ఇహనేంజేస్తావురా అబ్బీ నీకు ముందూ వెనుక, ఆ రంగంలో ప్రవేశం లేదుకదా! నిజంగా నీ కిదొక అగ్నిపరీక్ష స్మీ' అనుకుని బుఱ్ఱగోక్కున్నాడు యోగి.

ఇంతకాలం తనని పీల్చిపిప్పిచేసిన రోగం ఒక తరహాకు చెందినదనిన్నీ, దానిని నివారించడానికి సలహా లభించినప్పటికీ, అనుభవంలేని తను, తనకు కావలసిన వైద్యుని అన్వేషించుటలోని సాధక బాధకాలూ, తీసుకొనవలసిన ముందుజాగ్రతలూ సమూలంగా పునర్విమర్శించుకునేయోగికి, వారందినాలూ నీముషాలపై దొర్లినట్లయింది.

వారంరోజులూ సాయంసమయాల్లో యోగి కూర్చొని ఇసుకతిన్నెలూ, తిరగని సందులూ, ఆలోచించని సమస్యలూ లేవు.

ఒకరోజు, సూర్యాస్తమయానికి బారెడు దూరముండనగా గోదావరిషికారుకు బయలుదేరాడు యోగి. ఇసుకలో గోళీలాడేపిల్లలూ, వేరుశెనగ, బటానీ ఇత్యాది పదార్థాలను ముందుప్రోగుపెట్టి కాలాన్ని నరుకుతూ పిచ్చాపాటీవేసే మరికొందరూ పరీక్షలు దగ్గరపడుతున్నాయ్ ఇక్కడైనా ప్రశాంతంగావుంటుంది కదా యని పుస్తకాలు చేతపట్టుకుని (నెపం అదీ) ఓరచూపులుచూచే కాలేజీ విద్యార్థులూ, ఆనందం ఆస్వాదిస్తు ప్రకృతి సౌందర్యంలో లీనమయ్యే జంజలు, రంటలు, రంగవల్లులూ కళ్ళు జిగేల్‌మన్నాయ్ యోగికి. వాళ్లందరితో పోల్చిచూచుకుంటే వాళ్లకున్నదీ తనకు లేనిదీ ఏదో అస్పష్టపదార్థ లోపం కనిపిస్తోంది. నిజంగా సంధ్యాసౌందర్యం ఆనందించడానికే అచ్చటికి వచ్చినట్లయితే పడమటి కొండల్లో దోబూచులాడే అస్తమయభానుని చూస్తు మైమరచి గోదావరిలో తూలిపడిపోయేవాడే కాని ఒక మూలనుండి కిలకిలమనే నవ్వులు గుంపుగాచేరిన రామచిలుకలు వదులుతూయుంటే మతిపోయి నిర్లిప్తంగా అటుచూస్తున్నాడు.

'నమస్తే యోగీ' ఒక పరిచయకంఠం పలకరించేసరికి, తేరుకుని అటుచూచాడు. కొంతదూరంలో సత్యనారాయణ, ఆయన సతీమణి....' వీడు నమస్కారం పెట్టాడుకదా! కొంపదీసి, ఆ చిలకలన్ని చూస్తుయున్న సమయంలో వీడుగాని చాచాడా ఖర్మ' అనుకుని మొదట గాభరాపడినా నెవ్వర్‌మైండ్ అని స్వగతం పలుక్కున్నాడు యోగి. సత్యనారాయణ తననిచూచినవ్వుకున్నాడు. ఆనవ్వులో అపహాస్యం గోచరించింది డామిట్! చిన్న గుమస్తాగా యేడ్చే వీడా తననిచూచి నవ్వడం? తల తీసినంత పనైంది ఒక్కొక్కరి ప్రక్క ఒక్కొక్క సతీమణి, తనప్రక్క చూచుకునేసరికి గుండెగుబగుబలాడింది. అచ్చట నిలువలేక భారంగా అడుగువేస్తు లాడ్జికి చేరాడు యోగి.

నిస్సారంగా రాత్రి గడచింది.

తెల్లవారేక, లేస్తూనే కిటికీవగ్గరగా కుర్చీ వేసుకున్నాడు యోగి. రిక్షాలలో జంటలు సైకిల్సుమీద జోడీలు, ప్రపంచమంతా........ ఎందెందు వెదకిచూచిన....సందేహము లేదు. కళ్ళుమూసుకున్నాడు యోగి. లేచి పెరట్లోకి వెళ్ళాడు. అచ్చట లెగులాబీలను సింగారించుకొని, కనకాంబరపుపసుపుపై ఆకుపచ్చని శరీరాన్ని చేరవేసిన సూర్యకాంత పుష్పాలు ముఖమింతచేసుకుని భానునితో ఏమిటో వినిపించని గుసగుసలు....ఇక్కడ కూడానా?

'హల్లో యోగీ! వ్యవహారం జోరుగా ఉన్నట్లుందే!' అంటూ శర్మ ప్రవేశించాడు.

ఈ శర్మ యోగి స్నేహకోటిలో ఒకడు. అందులో, ఎచ్చటో ఎప్పుడో యోగికీ శర్మకీ బంధుత్వం ఉండడం మరొక స్పెషాలిటీ హెూదాలో కొంత చిన్నైనా ఇద్దరూ ఒకదగ్గరే పనిచేస్తుయుంటారు. మొదట్లో తనకి కూడా యోగిలాడ్జిలో కాస్త జాగా నివ్వమని అర్థించినా 'ఒరే అబ్బాయ్, నాకు ఒకరితో పడదు, మరేమీ అనుకోకు' అని సర్ది చెప్పి ఎదురింట్లో ఒక గది అద్దెకు కుదిర్చేడు యోగి. అప్పుడప్పుడు శర్మమాత్రం యోగి గదికి వస్తూయుంటాడు, కాని ఈయనమాత్రం గుమ్మం కదలడు. వీటన్నిటనిమించి అప్పుడప్పుడు యోగివద్ద చేబదులు కూడా తీసుకుంటాడు శర్మ.

అబ్బబ్బ! ఇలా దిగిపోయావేంరా నన్ను చంపడానికి' విసుక్కున్నాడు యోగి.

ఎప్పుడూ లేనిది మనవాడి ధోరణి ఇలా ఉందేమా అని బితుకూ బితుకుమంటూ చూచాడు శర్మ.

ఆసక్తిలేని సంభాషణలో పరధ్యానం టెంపోని పూర్తిగా ఖూనీచేస్తుంటే తర్వాత కలుద్దాం అనుకుని నిష్క్రమించాడు శర్మ.

ప్రతివిషయంలోను చిరా కెక్కువవుతుంది. ధ్యానం తగ్గి వైరాగ్యసూచనలు ఉబకజొచ్చినవి.

మరోవారం చప్పచప్పగా నడచిపోయింది. పర్యవసానంమాత్రం చంద్రునిమచ్చలా వెక్కిరిస్తూంటే 'నీ ఖర్మంతేరా పడుకో' అనుకున్నాడు యోగి.

మధ్యాహ్నం చల్లగాలికని వీధి కిటికీవగ్గర క్యాంప్‌కాట్‌వేసుకుని అలా పడుకున్నాడో లేదో నిద్ర ముంచుకురావడం యోగికి తెలియదు. మెలుకువవచ్చేసరికి ఇంచుమించు సాయంకాలమైపోయింది. ఆకాశమంతా చిన్న మబ్బుతెర కప్పియుంది. ధూళిరేగినరోడ్లను మునిసిపాలిటీకార్లు చిమ్మగొట్టాలతోతడిపాయి. మత్తు నుండి అప్పుడే తేరుకున్న యోగికి అప్పటి వాతావరణం ఉదయంలా కనిపించడంతో, గబగబాలేచి టూత్‌బ్రష్ పట్టుకున్నాడు. అప్పుడేవచ్చిన పనిమనిషి 'ఇదేటయ్యగోరూ?' అని ఆశ్చర్యంతో అనేసరికి "ఏం" అని ప్రశ్నించి "ఇది పొద్దున్నకాను. సాయంత్రమండీ" అన్న సమాధానం రాబట్టుకుని "చచ్చాం" అని చతికిలబడిపోయాడు మతిమరుపుయోగి.

వేడికాఫీ చురుక్కున దిగేసరికి, మనసు కుదుటపడింది. దృష్టి ఎదురింటిశర్మ అరుగుమీదపడింది, ఆ చూపులు మరింత కేంద్రీకరింపబడడంతో, మనసుకూడా లీనమై, తెరిచినోరు మూయడం మరచిపోయాడు యోగి.

కాచికాచి ఫిల్టర్ చేసిన అందాన్నంతా తనలో గుమ్మరించుకుని దివినుండి దిగిన గంధర్వకన్యలా కనుపించిందొక అమ్మాయ్. మల్లెచెండును వెనక్కునెట్టి భుజంమీంచి ముందుకుపడ్డ వాల్జడ కుచ్చును సన్నని వ్రేళ్ళతో వీణమీటినట్లు సవరించుకుంటూ, స్తంభాని కానుకుని, వీధి క్రొత్తదనాన్ని చూస్తోందా క్రొత్తపిల్ల. టకరించుకునే సోగకన్నులూ, ఇట్టే కందపోయే సౌకుమార్యమూ, ప్రతిఫలించే బుగ్గలసిగ్గులు....అమాయదారి ముక్కులో అంతటి సంపంగి సౌందర్య మెలా వచ్చిందా అని విస్తుపోయాడు యోగి. "నే నెప్పుడూ చూడలేదుకదా! ఆ సౌందర్యపు ముద్ద ఎవరా అని ప్రశ్నించుకున్నాడు. ఆ పుట్టుపూర్వోత్తరాలన్నీ నీ కెందుకు, నీ సంగతేదో చూచుకోమని తిట్టింది మనసు. భేషో యోగీ!! నువ్విన్నాళ్ళవరకూ ఓర్చుకునికూర్చున్నందుకు ఆ భగవంతుడే నీ మొరాలకించి పంపాడు సుమా, తొందరపడక మంచి ప్రణాళిక స్కెచ్ చేసుకోవోయ్, సరిగా చూడు నువ్వనుకొన్న డాక్టర్ లక్షణాలు మూర్తులా ఆమెలో రూపొందలేదుటోయ్" అంతరాత్మ సాక్ష్యం పలుకుతోంది. "మరింకేమీ సంకోచించకు, ఆమే నీకు తగిన డాక్టరు, నీ రోగనివారణకు ఆమెతప్ప మరొకరుండరు, ఉండబోరు లేలేలే "ఒకమూలనుంచి మనసు ఒకే నణుగుడు మొదలెట్టేసరికి "బాగుంది నీ వరస, ఆ అమ్మాయ్ అంత అందంగా వుందికదా! కెరటాల్లా గాలిలో తేలే చీరకట్టి నీటుగా తయారయిందికదా! మరి ఉదయం నుండి జిడ్డుకారే నీ ముఖాన్ని చూచీచూడడంతోటే తుప్పున ఉమ్మదూ? తొందరపడకూ...." అని ఆత్మని సముదాయించి లేచాడు యోగి.

సహజంగా స్నో, పౌడర్లు ఉపయోగించని యోగి, అప్రయత్నంగా టాయిలెట్ చేసుకున్నాడు. ఆ క్షణంలో అతని ఉత్సాహం, ఆ అమ్మాయి అందానికి సవాలు చేస్తోంది. మెల్లగా అరుగుమీదకివచ్చి, ఇంకా అచ్చటే నిలబడియున్న ఆ అమ్మాయిని దీర్ఘంగా చూడడంలో మునిగిపోయాడు యోగి. అన్వేషణలోని వెలుగు కళ్ళ మిరుమిట్లుగొల్పాయి. ఉండుండి ఆ అమ్మాయ్ ఇటుచూచి, సిగ్గుపడి గభీమని లోనికి పారిపోయింది. ఢభీమని ముందుకు పడ్డట్లయింది యోగికి. ఆరంభంలోనే అంత దుడుసైతే ఏ మౌతుంది? వ్రేలు కొరుక్కొని పశ్చాత్తాపపడ్డాడు. చుట్టూచూచేసరికి పక్కింటి ఓ ఏతంతు తెల్లనిమల్లు ముసుగు క్రీనీడల్లోంచి అతడిని చూస్తు తమాషాగా నవ్వుతోంది. అమ్మో!! ఆవిడదృష్టి అసలే మంచిదికాదు, ముత్యంలాంటి నువ్వు ఆవిడకంట్లో పడ్డావు! చూస్కో తప్పకుండా నీకీ రాత్రి దిష్టితగులుతుంది" అనుకొని లోనికివచ్చి, ఎవరూ చూడకుండా పరిహారంగా రెండు బియ్యపుగింజలు దిగదుడుచుకున్నాడు యోగి.

రెండూ, మూడూ, వారంరోజుల్లో వాతావరణం చాలా మారిపోయింది. ఎప్పుడూ

గదిలో ఉండనియోగి ఇప్పుడు గది వదలడు. చూస్తె సిగ్గుగ్రమ్మేసి పారిపోయే ఆ అమ్మాయి, ఇప్పుడు కదలమన్నా కదలదు. యోగి తన అరుగుమేదకొస్తె, ఆ అమ్మాయి వాళ్లరుగుమీద కొచ్చిందన్నమాటే. ఉత్తరం వ్రాస్తె తీసు కొంటుందా తీసుకోదా అని మొదట్లో అను మానంతోచి మచ్చుకై ఓ తెల్లకాగితం మడిచి ఎవరూ లేకుండా చూచి విసరినప్పుడు (ప్రమాదవశాత్తూ ఆ కాగితం ఇతరులకు దొరికినా భయంలేదు కనుక) ఆమె తీసుకొనేసరికి సాధించేవురా అబ్బాయ్ ఇహ నీకు భయం లేదు అనుకొని ప్రేమలేఖ నడిపేస్తున్నాడు యోగి. కాని ఆశ్చర్యం!!! సమాధానంమాత్రం ఎన్నాళ్ళకూ రాదూ .... "ఇదేం మనస్తత్వ మబ్బా" చికాకుగా అనుకొనేవాడు యొగి.

రాత్రి మధురంగా వుంది. పెరట్లో పందిరి మల్లెలు, నైట్‌క్వీన్ వాసనలు మత్తుగా గుబాళిస్తున్నవి. పడుకున్న యోగిగుండెల్లో గులాబి వికసించింది. సుషుప్తిలో పెదాలు వణకుతున్నాయ్.

గోదావరి నిర్మానుష్యపు టిసుకదిన్నెలు వెన్నెలకాంతిలో దేవలోకంలా వున్నాయ్. వాలుకిరణాల్లో వెండికెరటాలు మిలమిలమెరుస్తున్నాయ్. నదీమధ్యభాగంలో చిన్న ద్వీపం వెన్నెలముద్దల్లో దృశ్యానందంగా యుంది. ద్వీపంలోని చెట్లక్రీనీడలు ఒడ్డులపై ప్రసరించి నీటిలో ప్రతిబింబాలను అస్పష్టంగా సృజిస్తున్నవి. నిశ్చలజలాలను చీల్చుకుంటూ సాగే నావ, ద్వీపతీరంచేరీచేరగనే క్రిందకు దిగి చెయ్యందించాడు యోగి. తొట్రుపడే నైలన్ చీర నొకచేత్తో పొదిలిపట్టి, రెండో చేత్తో యోగి నానుకుని క్రిందకుదిగింది క్రొత్తపిల్ల.

వెన్నెలషికారు, మెత్తని యిసుక, చిన్న తనపుమనులు రేపడంతో, లేడిలా పరుగులు తీసింది కొత్తపిల్ల. గాలికితేలే చీరచెంగు, గాలిపడగలా ఎగురుతోంది.

"ఏయ్ కొత్తపిల్లా ఆగవూ? నీతో పందెం వేయలేను" బ్రతిమాలుకున్నాడు యోగి

"ఐతే రోజూనన్నుచూడడం చేతనవునూ?" అందామె.

"అమ్మ!! గట్టిదే" అనుకున్నాడు యోగి.

చంద్రకాంతి నిశ్శబ్దప్రపంచంపై నీలిరంగు విరజిమ్ముతున్నట్లుంది. ఆకుపచ్చని భూప్రకృతి నీలివర్ణంలో వర్ణవిశ్లేషణచెందుతోంది.

గరికలో కూర్చున్నారిద్దరూ.

"ఇన్నాళ్ళనుంచి పరిచయమున్నా నీ పేరే తెలియదు?"

ఒక్క నిముషం చూచింది. వెన్నెలమడుగులో ముంచితీసిన మంచిముత్యాల్లా మిలమిలా మెరుస్తుయుంటే, ఇంత అందం ఆ కళ్ళలో రూపొందించడానికై ఆ బ్రహ్మ కెన్ని యుగాలు పట్టిందా అని అనుకున్నాడు యోగి.

"నా పేరేనా? మీకెలా నచ్చితే అలాగే పిలవండి!"

"గుడ్‌గుడ్, ఐతే లిల్లీ...."

"లిల్లీ" గలాగలానవ్వి" సరే మీ యిష్టం"

"మరి అన్ని ఉత్తరాలు రాశానుగదా! ఒక్కదానికైనా సమాధానం పంపలేదేం?"

"సమాధానం యిస్తేనేగాని లేకపోతే లేదా యేం"

"నేను నిశ్చయం చేసుకోవద్దూ?"

"ఏమని?"

"మనపెళ్లి........" నసిగాడు యోగి.

సిగ్గుతో ముఖం కప్పుకుంది లిల్లి.

మాట్లాడవేం లిల్లీ?

మీరు పెళ్లిచేసుకుంటారుకదూ? అంటూ ఉన్నపాటునలేచి గోదావరివైపు పారిపోయింది లిల్లి. వెంటపడ్డాడు యోగి ఒక్కఉదుటున నదీగర్భంలో ఉరికిందా కొత్తపిల్ల. గగ్గోలుగా జలాలు చెదిరి కెరటాలు బయలుదేరాయ్. అంతలోనే ప్రశాంతవాతావరణంమారి ఆకాశం నిండా కారుమేఘాలు కమ్మివేశాయ్. హోరుమంటూ గెడధారవర్షం ప్రారంభమై, నిలువెత్తు కెరటాలు లేచినవి. నిముషంలో ఇసుక ద్వీపమంతా నీటిలో కరిగిపోయింది. శక్తికొద్దీ ఈదుతూ 'కొత్తపిల్లా లిల్లీ....లిల్లీ' అని అరుస్తున్నాడు యోగి. హోరులో కేక వినిపించడం లేదు.

స్వప్నజగత్తునుండి తేరుకున్న యోగి ఇంకా 'లిల్లీ' అంటూ లేచేసరికి, గుమ్మంలో పిల్లెదురయింది. 'ఛీ ఛీ' అనుకొని లేచాడు యోగి. అప్పటికే బాలభానుని వెలుగులు వీధుల్లోనికి వచ్చినవి. నిద్రముఖంతోటే కొత్త పిల్లకోసం చూచాడు యోగి. రోజూ తను బయటకువచ్చేసరికి, చిర్నవ్వునవ్వుతూ బయటకువచ్చే లిల్లీ, ఎందుకో ఆ సమయంలో బయటకురాలేదు. ఎంతో ఆప్తబంధువును కోల్పోయినట్లు, జగత్తే కళావిహీనంగా యున్నట్లు ఫీలయాడుయోగి. చివరకు ఉండలేక, ఇన్ఫర్మేషన్ బ్యూరోద్వారా (అంటే పనిమనిషిసుమండీ) రహస్యం రాబట్టుకున్నాడు.

బాంబు ప్రేలినట్లయింది యోగి హృదయంలో.

'లిల్లీ వెళిపోయిందా? ఎచ్చటికి ఎందుకు?'

వారందినాల్లో చాలా మారిపోయాడుయోగి. అతనిజీవితంలో రుచితగ్గిపోయింది చూపులో విరక్తి కనుపిస్తుంది.

* * *

'యోగీ....' శర్మ ప్రవేశించాడు.

'ఊఁ....' లోతుల్లోంచి పలికాడు యోగి!

'ఇదేమిటీ వాలకం, గడ్డాలా, మీసాలా?'

'ఒక ఉపకారం చేయగలవా శర్మా?' అని జాలిగా అడిగాడు యోగి.

'నువ్వు చేయించుకోగలిగినంత ఉపకారమంటూ వుంటుందటోయ్'

'దానికేంగాని, చిన్నసంగతి అడిగితే చెప్పగలవా?'

'నీకు చెప్పనూ?'

అడుగుదామా వద్దా అని ఒక క్షణం ఆలోచించాడు యోగి.

'ఆ యింటికి ఈమధ్య ఓ అమ్మాయ్ వచ్చిందికదూ! ఆమె వేర్ ఎబౌట్సు' శర్మ ముఖంలో రంగుమారింది. ఎందుకో ఒక్క క్షణం ఆగిపోయాడు.

'నిజంగా నీకు కావాలా? ఒకనేళ తెలిస్తె?' ప్రశ్నించాడు శర్మ.

'వివాహం చేసుకుందామని!'

'నిజం....' ఆశ్చర్యంగా చూచాడు.

నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ

'నాకు తెలుసుయోగీ, నీవు రాసిన ప్రేమలేఖలు కూడా చూచాను నీవే ఇట్లాంటి పని చేస్తావని జన్మలో అనుకోలేదు సుమా. అడిగావు కనుక చెపుతున్నాను. ఆ అమ్మాయ్ ఢిల్లీలో వాళ్ళ పేరెంట్సుదగ్గరుండి చదువుకుంటోంది. వేసవిసెలవులు కదూ; ఇక్కడున్న వాళ్లన్నయ్యని చూచుకుని, మళ్ళా వెళ్ళిపోయింది'

ఆగి చూచాడు శర్మ.

మాటలు వింటూంటే ఏదో అజ్ఞాతశక్తి తనని తల్లక్రిందులుచేసి, చీకట్లోకి విసరినట్లయింది యోగికి.

ఆమె ఎవరని అడిగావుకదూ? నా చెల్లెలు కమల!

కొత్తపిల్ల స్వప్నరాణి లిల్లీ....కమల....శర్మ చెల్లెలా? రివాల్వర్ గురిచేసి నిర్దాక్షిణ్యంగా షూట్‌చేసినట్లు దిమ్మెరపోయాడు యోగి. ఎంత నమ్మకద్రోహం తలపెట్టాడు తను!!

మరింత నల్లబడిన ముఖంతో.

'శర్మా! ఇంకా నీ దగ్గర దాచవలసినదేముంది? నా జీవితంలో మొదటిసారిగా చూచినదీ, మొదటిసారిగా ప్రేమించినదీ ఆ అమ్మాయినే. కాని ఆమె నీ చెల్లెలని తెలియక తప్పుచేశాను. నీ స్నేహితుని క్షమిస్తావా శర్మా'

శర్మచేతులు పట్టుకున్నాడు యోగి.

ఘోర నిశ్శబ్దం కొన్ని నిముషాలు ఆవరించింది లాడ్జినిండా.

'ఛఛఛ! తప్పేమిటోయ్; అదీకాక నువ్వూ, కమలా ఎప్పుడు కూడబలుక్కున్నారా అని ఆశ్చర్యంగాయుంది. అది నిన్నుతప్పే' వేలు కొరుక్కుని మాట మార్చాడు శర్మ.

'మానాన్నకంతా వ్రాశాను. మరేం భయపడకు ఢిల్లీచలో.

"ఢిల్లీచలో" మనసులో కూనిరాగంతీశాడు యోగి.

"ఎంత మంచివాడవు శర్మా, పోని నా కివ్వవలసిన బాకీ రెండు వందలూ వదిలేశాను" అంటూ శర్మని కౌగలించుకున్నాడు యోగి.

★